సాక్షి
పశ్చిమగోదావరి

బుధవారం । 19 । ఏప్రిల్ । 2023



గోదావరిలో మునిగి...

ఆచంట మండలం భీమలాపురంలో గోదావరిలో స్నానానికి దిగి ఇద్దరు పదో తరగతి విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. 8లో ▸



ఆక్వాకు అండగా ప్రభుత్వం

ఆక్వా రంగానికి ప్రభుత్వం అందిస్తున్న సహాయానికి కృతజ్ఞతగా ఉండి మండలం వాండ్రంలో జిల్లా ఆక్వా వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. 8లో ▸

వేసవి తాపం.. ఉపశమనం

జిల్లాలో భానుడు భగభగల నేపథ్యంలో జనం ఉపశమనం కోసం పండ్ల రసాలు, కూల్ డ్రింక్స్ తాగుతూ సేదదీరుతున్నారు. పుచ్చకాయలకు డిమాండ్ పెరిగింది.



8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (బుధవారం సాయంత్రం)	సహరి (గురువారం వేకువజాము)
భీమవరం	6.27	4.22
తాడేపల్లిగూడెం	6.29	4.32
నరసాపురం	6.27	4.22

న్యూస్‌రీల్

భీమవరంలో ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం (ప్రకాశంచౌక్): పవిత్రమైన రంజాన్ నెలలో ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్‌లో పాల్గొనడం సంతోషంగా ఉందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. భీమవరంలోని టౌన్ హాల్లో జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో మంగళవారం కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే జీవితమని రంజాన్ మాసం గొప్ప సందేశం ఇస్తుందన్నారు. జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందరరెడ్డి మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో దేవుడు చూపిన విధంగా అందరూ శాంతి మార్గంలో పయనించేందుకు అంకితం కావాలన్నారు. ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ రంజాన్ మాసం చాలా పవిత్రమైనదని, ముస్లింలందరూ మనసు దేవునిపై లగ్నం చేసి నిబద్ధతతో ప్రార్థనలు చేయడం చాలా ఆనందదాయకం అని అన్నారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ముస్లిం సోదరులందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. భీమవరం ఆర్డీవో దాసిరాజు, ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు, డీసీఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకట స్వామి, జిల్లా మైనార్టీ అధికారి ఎస్ఎస్ కృపావరం, భీమవరం ముస్లిం కమిటీ అధ్యక్షుడు ఎస్.కె.రబ్బానీ, ప్రభుత్వ ఖాజీ ఫైయాజ్ హలామ్, వక్ఫ్ బోర్డు చైర్మన్ కరీముల్ల బాషా పాల్గొన్నారు.

స్పాట్ వాల్యుయేషన్ కేంద్రం తనిఖీ



వీరవాసరంలో స్పాట్ వాల్యుయేషన్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

వీరవాసరం: వీరవాసరంలోని జెడ్పీ హెచ్ పాఠశాలలో జరుగుతున్న పదో తరగతి స్పాట్ వాల్యుయేషన్ కేంద్రాన్ని కలెక్టరు పి.ప్రశాంతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టరు మాట్లాడుతూ స్పాట్ వాల్యుయేషన్‌లో పాల్గొనే ఉపాధ్యాయులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేయాలని కలెక్టరు ఆదేశించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టరు సూచించారు. కలెక్టరు వెంట డీఈవో ఆర్.వెంకటరమణ, ఎంఈఓ, హెచ్ఎం తదితరులు పాల్గొన్నారు.

రసవత్తరంగా నాటిక పోటీలు



నాన్నా, నేనొచ్చేస్తా నాటికలోని దృశ్యం

సాక్షి,భీమవరం: భీమవరం పట్టణంలో కళారంజని కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి నాటిక పోటీలు మూడో రోజు రసవత్తరంగా సాగాయి. గునుపూడిలోని సోమేశ్వర, జనార్ధనస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న నాటిక పోటీల్లో మంగళవారం హర్షక్రియేషన్స్ విజయవాడ వారి స్వర్ణకమలాలు, శ్రీ అమృతలహరి థియేటర్స్ ఆర్ట్స్ ప్రదర్శించిన నాన్నా నేనొచ్చేస్తా నాటికను ప్రదర్శించారు. నాటిక పోటీల ముగింపు సందర్భంగా కళారంజని ఆధ్వర్యంలో ముగ్గురు కళాకారులను ఘనంగా సన్మానించారు. రంగ స్థల కళాకారిణి గుడివాడ లహరిని మహానటి సావిత్రి పురస్కారంతో, విజయవాడకు చెందిన సృతి సమన్వవిని నాట్య వసంత బిరుదుతో, గుంటూరుకు చెందిన షేక్ బి హసన్‌ను కళారంజని యువ కళాతేజం అవార్డుతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళారంజని వ్యవస్థాపక అధ్యక్షుడు జవ్వాది దాశరథి శ్రీనివాస్, వీరవాసరం జెడ్పీటీసీ గుండా జయప్రకాష్‌నాయుడు, విన్నకోట వెంకటరమణ, భీమాల శ్రీరామ్మూర్తి, మెంటేపూర్ణ చంద్రరావు, వై.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

డెల్టాలో పామాయిల్ సాగు

- గోదావరి నది తీర ప్రాంతంలో సాగుకు అనుకూలం
- హెక్టారుకు రూ.26 వేల రాయితీ

సాక్షి, భీమవరం: ఒకప్పుడు మెట్ట ప్రాంతానికి మాత్రమే పరిమితమైన పామాయిల్ తోటల పెంపకంపై ఇప్పుడు డెల్టా వాసులు ఆసక్తి చూపిస్తున్నారు. గోదావరి తీరప్రాంతం పామాయిల్ సాగుకు అనుకూలమని తేలడంతో మొగల్తూరు, పోడూరు, నరసాపురం పాలకొల్లు మండలాల్లోని కొన్ని గ్రామాల్లో ఇప్పటికే రైతులు ప్రయోగాత్మకంగా పామాయిల్ పండిస్తున్నారు. జిల్లాలోని మరికొన్ని మండలాలు కూడా పామాయిల్ సాగుకు అనుకూలమని ఉద్యాన శాఖాధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ ప్రోత్సాహం కూడా తోడవడంతో లంక భూములున్న ఆచంట, పెనుగొండ, యలమంచిలి మండలాల్లోనూ సాగు చేయడానికి రైతులు మక్కువ చూపుతున్నారు.

పలు మండలాల్లో పామాయిల్ సాగుపై అవగాహన

పామాయిల్ పెంపకంపై ఇప్పటికే ఉద్యానవన శాఖ జిల్లాలోని పలు ప్రాంతాలలో అధ్యయనం చేసి సాగు చేయాలని రైతులకు సూచనలు చేసింది. దీనిలో భాగంగానే మొగల్తూరు మండలంలో ఉద్యాన శాఖ జిల్లా అధికారి దుర్గేష్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. మెట్ట ప్రాంతంలోని రైతులకు లాభదాయకంగా ఉన్న పామాయిల్ సాగును డెల్టా రైతులు చేపడితే వాణిజ్య పంటలతో సమానంగా మంచి ఆదాయం వస్తుందని చెబుతున్నారు. జిల్లా విభజన తరువాత పామాయిల్ సాగు కేవలం తాడేపల్లిగూడెం మండలంలోనే ఉండేది. జిల్లాలోని 20 మండలాల్లో 37,500 ఎకరాల్లో కొబ్బరి, కోకో, అరటి, మామిడి, తమలపాకు, నిమ్మ తదితర 32 రకాల ఉద్యాన పంటల సాగు చేస్తున్నారు. దీనిలో 4,580 ఎకరాల్లో పామాయిల్ పండిస్తున్నారు. ఉద్యానవన పంటల సాగును మరింత ప్రోత్సహించే లక్ష్యంతో పామాయిల్‌ను సాగు చేయాలని రైతులకు సూచిస్తోంది. అధిక ఆదాయం వచ్చే పంటలపై దృష్టి కేంద్రికరించేలా ఉద్యాన శాఖ ప్రయత్నాలు ప్రారంభించింది.



థాయిలాండ్, మలేసియా నుంచి మొక్కలు

పామాయిల్ సాగు చేసే రైతులకు హెక్టారుకు రూ.26 వేలు ప్రభుత్వం రాయితీ ఇస్తుంది. వంటనూనె కొరత దృష్టిలో పెట్టుకుని పామాయిల్‌ను ప్రోత్సహించేలా చర్యలు తీసుకున్నారు. స్థానికంగా పామాయిల్ సాగు పెంచేందుకు థాయిలాండ్, మలేసియా నుంచి పామాయిల్ మొక్కలు తీసుకొచ్చి సాగు ప్రారంభించారు. పూర్వపు పశ్చిమగోదావరి జిల్లాలోని పెదవేగి కేంద్రంగా పామాయిల్ నూనె మిల్లు కూడా ప్రారంభించారు. దీనిని విభజన పశ్చిమగోదావరి జిల్లాలో విస్తరించడానికి చర్యలు చేపట్టారు. పామాయిల్ ప్రారంభంలో నాలుగేళ్లపాటు అంతర పంటలు వేసుకోవడానికి ఎకరానికి రూ.5,200లు రైతుకిస్తారు. పామాయిల్ చెట్లు ఎనిమిదో ఏట నుంచి దిగుబడినిస్తాయి. ఏడాదికి ఎకరాకు 10 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. మొక్కలు నాటిన నాలుగేళ్ల వరకు అంతర పంటలు వేసుకోవచ్చు.

సాగుకు ముందుకు రావాలి



జిల్లాలోని రైతులు ఎక్కువగా వరి, ఆక్వా, కొబ్బరి, కూరగాయలు సాగుచేస్తున్నారు. పామాయిల్ సాగుకు అనుకూలమైన భూములున్నందున రైతులు ముందుకు వస్తే ప్రభుత్వం రాయితీ ఇస్తుంది. హెక్టారుకు రూ. 26 వేలు మొక్క దశ నుంచి ఎదిగే వరకు ప్రభుత్వం సహాయం అందిస్తుంది. లాభదాయమైన పామాయిల్ సాగు పట్ల ఆసక్తి ఉన్న రైతులు 79950 86770 నెంబరులో సంప్రదించాలి.

– ఎ.దుర్గేష్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి, భీమవరం

వేడుకగా శ్రీపుష్ప యాగోత్సవం



శ్రీపుష్ప యాగోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి ఉపాలయమైన లక్ష్మీపురంలోని శ్రీ సంతాన వేణు గోపాల జగన్నాథ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో శ్రీనివాసునికి జరుగుతున్న కల్యాణ మహోత్సవాలు మంగళవారం జరిగిన విశేష కార్యక్రమాలతో ముగిశాయి. ఈ సందర్భంగా ఉదయం ఆలయంలో శ్రీనివాసునికి, పద్మావతి, అండాళ్ అమ్మవార్లకు అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ యజ్ఞశాలలో హోమాది కార్యక్రమాలను జరిపారు. రాత్రి ఆలయంలో ద్వాదశ కోవెల ప్రదక్షిణలను ఆలయ అర్చకులు, పండితులు, ఆగమ విద్యార్థులు, భక్తులు వైభవోపేతంగా నిర్వహించారు. అనంతరం స్వామివారికి, అమ్మవార్లకు శ్రీ పుష్పయాగోత్సవాన్ని అర్చకులు వేద మంత్రోచ్ఛరణలతో జరిపారు.

చంద్రబాబు శిఖండి, పవన్ హైదరాబాద్ వాసి

గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్, చిత్రంలో ఎమ్మెల్యే ఆళ్ల నాని

ఏలూరు (మెట్రో) : ఎన్ని కుయుక్తులు పన్నినా.. ఎంతమంది కలిసి వచ్చినా.. రానున్న ఎన్నికల్లో 175 స్థానాల్లోనూ వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమని గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. ఏలూరులో మంగళవారం నిర్వహించిన గృహ నిర్మాణ శాఖ సమీక్షలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబు శిఖండిలా వ్యవహరిస్తూ గృహ నిర్మాణాలు సాగకుండా అడ్డుపడుతున్నారని మండిపడ్డారు. సెల్ఫీ పిచ్చితో చంద్రబాబు పిల్ల చేష్టలు చేస్తున్నారని, అభివృద్ధిని చూసి ఓర్వలేకపోతున్నారని అన్నారు. చంద్రబాబు, ఆయన తనయుడు లోకేశ్‌లకు దమ్మూ, ధైర్యం ఉంటే రాష్ట్రంలోని కోటీ 60 లక్షల ఇళ్లకు రాగలరా... అని మంత్రి ప్రశ్నించారు. చంద్రబాబుకు పవన్‌కల్యాణ్ దత్తపుత్రుడని, ఆయన హైదరాబాద్‌లో ఉంటూ అప్పుడప్పుడు ఆంధ్రాకు వస్తున్నారని ఎద్దేవా చేశారు. దత్తపుత్రుడి తోక పట్టుకుని చంద్రబాబు వేలాడుతున్నారని, 175 స్థానాల్లో సైకిల్ గుర్తుపై అభ్యర్థులను నిలిపే దమ్ము చంద్రబాబుకు లేదని ఆయన ఎద్దేవా చేశారు. తెలంగాణ మంత్రి హరీష్‌రావు వస్తే ఆంధ్రాలో అభివృద్ధి ఏం జరిగిందనేది చూపిస్తామని జోగి రమేష్ చెప్పారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల ఊళ్లను తలపిస్తున్నాయని చెప్పారు.

రైస్ మిల్లర్ల బకాయిలు త్వరలో చెల్లిస్తాం

పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



తణుకులో రైస్ మిల్లర్ల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

తణుకు టౌన్: రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైసు మిల్లర్లకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలన్నీ త్వరలోనే చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. మంగళవారం తణుకులోని ఎగ్ కల్యాణ మండపంలో ధాన్యం కొనుగోలుకు సంబంధించి తూర్పు, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాలకు చెందిన రైస్ మిల్లర్లతో సమీక్షా సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి అధ్యక్షత వహించారు. మంత్రి కారుమూరి మాట్లాడుతూ రైతులు, రైస్ మిల్లర్ల మేలు కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నూతన ధాన్యం కొనుగోలు విధానాన్ని అమలు చేస్తుందన్నారు. రైతులు, మిల్లర్లు, అధికారుల సమన్వయంతో ఈ రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోలును విజయవంతం చేయాలని కోరారు. మిల్లర్లకు పాత బకాయిలన్నీ ఒకేసారి చెల్లించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు.

5 లక్షల టన్నుల బాయిల్డ్ రైసు కొనుగోలు

గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో బాయిల్డ్ రైస్ కొనుగోలు చేసేందుకు కేంద్ర ఆహార, పౌర సరఫరాల శాఖ నుంచి అనుమతులు వచ్చినట్లు మంత్రి చెప్పారు. ఐదు లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ బియ్యం కొనుగోలుకు కేంద్రం అంగీకరించినట్లు తెలిపారు. రైస్‌మిల్లర్లు సీఎంఆర్ విధానంతో పాటు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధాన్యం కొనుగోలులో ఆన్‌లైన్ విధానం వల్ల ప్రతి రైతుకు ఎకరానికి రూ.9 వేలు అదనంగా లభించినట్లు తెలిపారు.

ధాన్యం కొనుగోలులో జేసీలకు పూర్తి అధికారాలు

రైతుల నుంచి ధాన్యం కొనుగోలు విషయంలో జాయింట్ కలెక్టర్లకు పూర్తి స్థాయి అధికారాలున్నాయని, రైసు మిల్లర్లు జేసీ ఆదేశాలను పాటించాలని పౌర సరఫరాల శాఖ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్ చెప్పారు. గతంలో దళారులు, ఏజెంట్లు, మిల్లర్ల ప్రవేయంతో గిట్టుబాటు ధరలేక రైతులు ఇబ్బందులు పడేవారని చెప్పారు. ప్రభుత్వం ఆర్‌బీకేల ద్వారా దాన్యం కొనుగోలు చేపట్టి మిల్లర్లను సరీ్వస్ ప్రొవైడర్లుగా చేశామన్నారు. ధాన్యం తూనికల యంత్రాలను 15 రోజులకు ఒకసారి చెక్ చేసుకోవాలని కోరారు. రైతులకు ప్రభుత్వం కల్పించిన కనీస మద్దతు ధరకు మించి కూడా రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేయవచ్చని చెప్పారు. రేషన్ బియ్యం రీసైక్లింగ్ చేసే రైస్ మిల్లర్లపై పీడీ కేసులు నమోదు చేస్తున్నామన్నారు. ఎఫ్‌సీఐ గొడౌన్‌లలో ఖాళీలు లేక జిల్లాలోని రైస్ మిల్లర్ల ఇబ్బందులు గమనించిన మంత్రి కారుమూరి ఢిల్లీలోని ఎఫ్‌సీఐ ఉన్నతాధికారులతో మాట్లాడి తమిళనాడులో ఖాళీగా వున్న గొడౌన్‌లలో మన బియ్యాన్ని నిల్వ చేసుకునేలా ఒప్పించినట్లు తెలిపారు. రాష్ట్రంలో ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైసు మిల్లర్లకు చెల్లించాల్సిన రూ. 1000 కోట్ల బకాయిలకు సంబంధించి బిల్లులు, డాక్యుమెంట్లను వెంటనే సిద్ధం చేయాలని రైస్ మిల్లర్లను పౌర సరఫరాల శాఖ చైర్మన్, ఎండీ జీ వీర పాండ్యన్ కోరారు. బకాయిలను వెంటనే చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ బీ.లావణ్యవేణి, జిల్లా రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు సామంతపూడి రామరాజు, తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు చిట్టూరి వెంకట సుబ్బారావు, ఏలూరు జిల్లా అధ్యక్షుడు ఆళ్ల సతీష్ చౌదరి, ఆత్కూరి దొరయ్యతో పాటు పౌర సరఫరాల శాఖ అధికారులు, తహసీల్దార్ పీఎస్‌డీ ప్రసాద్ పాల్గొన్నారు.

ఎస్‌ఏ-2 పరీక్షలకు సన్నద్ధం

1 నుంచి 9వ తరగతి విద్యార్థులకు పరీక్షలు

నూజివీడు: ఒకటో తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలలో భాగంగా సమ్మెటివ్ అసెస్‌మెంట్ (ఎస్ఏ-2) పరీక్ష నిర్వహించేందుకు విద్యా శాఖ సర్వం సిద్ధం చేసింది. పరీక్షల షెడ్యూల్‌ను ఎస్‌సీఈఆర్‌టీ విడుదల చేసింది. ఒకటో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు విద్యార్థులకు ఈ నెల 20 నుంచి 27 వరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఈ నెల 20 నుంచి 29 వరకు ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి 11.15 గంటల వరకూ పరీక్షలు నిర్వహించనున్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఈ షెడ్యూల్‌ను పాటించనున్నాయి. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున విద్యార్థుల ఆరోగ్యం విషయంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. పరీక్షలు పూర్తయ్యాక మధ్యాహ్నం భోజనం పెట్టి విద్యార్థులను ఇళ్లకు పంపాలి.

సీబీఏ విధానంలో పరీక్షలు : సమ్మెటివ్ అసెస్‌మెంట్-2 పరీక్షలను సీబీఏ(క్లాస్‌రూమ్ బేస్డ్ అసెస్‌మెంట్) విధానంలో నిర్వహిస్తారు. దీనిలో భాగంగా విద్యార్థులకు ప్రశ్నాపత్రంతో పాటు ఓఎంఆర్ షీట్‌లు ఇస్తారు. ప్రశ్నకు సంబంధించిన జవాబును ఓఎంఆర్ షీట్‌లో బబుల్ చేయాల్సి ఉంటుంది. ఈ విధానాన్ని ఫార్మెటివ్ అసెస్‌మెంట్(ఎఫ్ఏ)-1, 3లలో అమలు చేయగా, ఎఫ్ఏ-2, ఎఫ్ఏ 4, ఎస్ఏ-1 పరీక్షల్లో పాత విధానంలో నిర్వహించారు.20న 1 నుంచి 9వ తరగతి వరకు తెలుగు, 24న 1 నుంచి 5 వరకు ఇంగ్లీషు, 6 నుంచి 9వ తరగతి వరకు సెకండ్ లాంగ్వేజ్, 25న 1-5 వరకు గణితం, 6-9వ తరగతి వరకు ఇంగ్లిషు, 26న 3, 4, 5 తరగతులకు పర్యావరణ శాస్త్రం, 6 నుంచి 9 తరగతులకు గణితం , 27న 3, 4, 5 తరగతులకు ఓరియంటల్ పరీక్ష, 6 నుంచి 9 తరగతులకు సైన్స్, 28న 6 నుంచి 9 తరగతులకు సోషల్, 29న 6 నుంచి 9 తరగతులకు కాంపోజిట్ కోర్సులకు పరీక్షలు నిర్వహిస్తారు.

ప్రభుత్వ చలివేంద్రాలు

- వేసవి దాహార్తి తీర్చేలా మజ్జిగ, మంచినీళ్ల ఏర్పాటు
- జిల్లాలో ఇంతవరకూ 228 చలివేంద్రాలు
- 6 మున్సిపాలిటీలు, 368 పంచాయతీల్లో ఏర్పాటుకు సన్నాహాలు

భీమవరం (ప్రకాశం చౌక్): వేసవి దృష్ట్యా బాటసారులు, వాహనదారుల దాహార్తిని తీర్చేందుకు ప్రభుత్వమే చలివేంద్రాలు ఏర్పాటు చేస్తుంది. పట్టణాలు, గ్రామాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేసి మంచినీళ్లు, మజ్జిగ అందజేస్తున్నారు. ఆయా పట్టణాల్లో, గ్రామాల్లో చలివేంద్రాలు స్థానికులతో పాటు ప్రయాణికులకు దాహార్తి తీరుస్తున్నాయి. మున్సిపాలిటీలు, పంచాయతీలు ఈ చలివేంద్రాల నిర్వహణ చూసుకుంటాయి. చలివేంద్రాల ఏర్పాటుపై కలెక్టర్ పి.ప్రశాంతి ప్రత్యేక దృష్టి పెట్టారు.



ఇరగవరం మండలం ఇల్లిందలపర్రులో ఏర్పాటు చేసిన చలివేంద్రం



తణుకు మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన చలివేంద్రం

ఇంతవరకూ 228 చలివేంద్రాల ఏర్పాటు : జిల్లాలో 586 వార్డులు, గ్రామాలకు సంబంధించి ఇంతవరకు 228 చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. వేసవి సీజన్ వరకు ఈ చలివేంద్రాలు నిర్వహిస్తారు. 20 మండలాల్లోని 368 గ్రామ పంచాయతీలు, 7 మున్సిపాలిటిల్లోని వార్డుల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు.

ప్రజలు ఇబ్బంది పడకుండా..



వేసవి దృష్ట్యా ఈ చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం. జిల్లాలోని మున్సిపాలిటీలు, గ్రామాల్లో ఈ చలివేంద్రాలు ఏర్పాటు చేసి మంచినీరు, మజ్జిగ సరఫరా చేస్తున్నాం. పట్టణాల్లో మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు చలి వేంద్రాల నిర్వహణ చూసుకునేలా చర్యలు తీసుకుంటున్నాం.

– పి.ప్రశాంతి, జిల్లా కలెక్టర్

ఇంతవరకూ ఏర్పాటు చేసిన చలివేంద్రాల వివరాలు

మండలం/ మున్సిపాలిటీ	చలివేంద్రాలు	మండలం/ మున్సిపాలిటీ	చలివేంద్రాలు	మండలం/ మున్సిపాలిటీ	చలివేంద్రాలు
ఆచంట	6	ఇరగవరం	10	పెనుగొండ	6
ఆకివీడు	2	కాళ్ల	13	పెనుమంట్ర	13
ఆకివీడు రూరల్	5	మొగల్తూరు	17	పోడూరు	7
భీమవరం రూరల్	4	నర్సాపురం రూరల్	7	తాడేపల్లిగూడెం రూరల్	23
భీమవరం అర్బన్	10	నర్సాపురం టౌన్	3	తాడేపల్లిగూడెం అర్బన్	10
యలమంచిలి	10	పాలకోడేరు	8	తణుకు రూరల్	3
గణపవరం	29	పాలకొల్లు రూరల్	9	తణుకు అర్బన్	4
		పాలకొల్లు అర్బన్	6	ఉండి	1
		పెంటపాడు	4	వీరవాసరం	15

నాడు-నేడు పనులు సకాలంలో పూర్తి చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం (ప్రకాశం చౌక్): నాడు-నేడులో వివిధ పాఠశాలలు, కళాశాలలో చేపట్టిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టరు పి.ప్రశాంతి సంబంధింత అధికారులను ఆదేశించారు. భీమవరంలోని కలెక్టరు కార్యాలయం నుంచి మండల స్థాయి అధికారులతో మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరు మాట్లాడుతూ సెకండ్ ఫేజ్‌లో విడుదల చేసిన నిధుల నుంచి మరుగుదొడ్ల నిర్మాణం, మేజర్, మైనర్ రిపేర్ల పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఇంతవరకు చేసిన ఖర్చులకు సంబంధించి బిల్లులను వెంటనే అప్‌లోడ్ చేయాలని సూచించారు. కొన్ని పాఠశాలలకు వచ్చిన టాయిలెట్ సామానులు, టైల్స్, ఎలక్ట్రికల్ సామాన్లు , డోర్లు తదితర మెటీరియల్ పనులు పూర్తి చేసి కంప్లీషన్ నమోదు చేయాలని చెప్పారు. నాడు - నేడు పనులలో ఎక్కడైనా క్వాలిటీలో గాని, నిధుల వినియోగంలో గాని తేడాలు గమనిస్తే ఎవరిని వదిలేది లేదని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాఠశాలల వారీగా అభివృద్ధి పనులకు రూపొందించిన అంచనాలు ఎంతవరకు పూర్తయ్యాయి, ఇంకా ఎంత చేయవలసి ఉంది తదితర వాటిపై నివేదిక అందజేయాలని ఆదేశించారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పనివారీగా ఇప్పటివరకు పూర్తయిన వాటిని అప్‌డేట్ చేయాలని కలెక్టరు సూచించారు. ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ సెక్రటరీ వారంలో రెండు రోజులు విధిగా పాఠశాలల్లో తనిఖీకి వెళ్లాలన్నారు. ఈ వారంలో తనిఖీలకు వెళ్లని ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సెక్రటరీలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కలెక్టరు సంబంధిత అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఈఓ ఆర్. వెంకటరమణ, సమగ్ర శిక్ష అడిషనల్ కోఆర్డినేటర్ పి.శ్యామ్ సుందర్ పాల్గొన్నారు.

శ్రీ హనుమాన్ ట్రావెల్స్‌పై కేసు నమోదు

ఏలూరు టౌన్: ఏలూరు ఆర్ఆర్ పేటలోని శ్రీ హనుమాన్ ట్రావెల్స్‌పై ఏలూరు టూటౌన్ పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు అశోక్‌నగర్ ప్రాంతానికి చెందిన అప్పారావు, అతని కుటుంబ సభ్యులు గంగా పుష్కరాలకు యాత్రా స్పెషల్‌లో టిక్కెట్లు బుక్ చేసుకున్నారు. హనుమాన్ ట్రావెల్స్ యజమాని బీఎస్ మూర్తి వారి వద్ద రూ.లక్షకుపైగా డబ్బులు కట్టించుకున్నారు. బంధువుల్లో ఒకరు మరణించడంతో అప్పారావు యాత్రను రద్దు చేసుకున్నారు. తాము చెల్లించిన సొమ్మును తిరిగివ్వాలని కోరగా నిరాకరించడంతో ఏలూరు టూటౌన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

కోతులకు భయపడి..

చాట్రాయి: కోతులు దాడి చేయడంతో భయపడి డాబాపై నుంచి కింద పడటంతో ఓ మహిళ మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని నూరంపాలెం గ్రామానికి చెందిన గుడిమళ్ల ముత్యాలు (55) నెల క్రితం తన డాబాపై ఉన్న కోతులను తోలడానికి ఎక్కింది. దీంతో కోతులు ఒక్కసారిగా ఆమెపై దాడి చేయడంతో డాబా పైనుంచి ప్రమాదవశాత్తు కిందపడగా తలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే ఆమెను వైద్యం నిమితం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది.

విద్యుదాఘాతానికి వ్యక్తి మృతి


చలం గోపి మృతదేహం

నూజివీడు: విద్యుత్ షాక్‌కు గురై ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. దీనికి సంబంధించి రూరల్ ఎస్సై తలారి రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నూజివీడు పట్టణంలోని రామాయమ్మరావుపేటకు చెందిన చలం గోపి (31) మండలంలోని రామన్నగూడెంలోని వండేకారి ద్వారకానాథ్‌కు చెందిన ఆయిల్‌పామ్ తోటలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఈనెల 17న సాయంత్రం ఫ్యూజు వేస్తుండగా షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. మంగళవారం పోస్టుమార్టమ్ చేసి కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు.

జగనన్న కాలనీలను సుందరంగా తీర్చిదిద్దుతాం

- గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్
- ఎమ్మెల్యే వాసుబాబుతో కలిసి భీమడోలులోని జగనన్న, పాత ఇందిరమ్మ కాలనీల పరిశీలన


భీమడోలులోని పాత ఇందిరమ్మ కాలనీని పరిశీలిస్తున్న మంత్రి జోగి రమేష్ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్, జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, ఎమ్మెల్యే వాసుబాబు

భీమడోలు: జగనన్న కాలనీలను సర్వాంగ సుందర గ్రామాలు తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని, జగనన్న కాల్లో పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పిస్తున్నామని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. భీమడోలులోని దిగుడుపాటి దిబ్బ ఏరియాలోని లేఅవుట్‌లో నిర్మిస్తున్న జగనన్న కాలనీని మంగళవారం సాయంత్రం ఆ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆజయ్‌జైన్, జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. జగనన్న కాలనీలో రూ.54 లక్షలతో 64 వీధి దీపాల కోసం నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను కాలనీలోని మహిళా లబ్ధిదారులతో కొబ్బరికాయ కొట్టించి ప్రారంభించారు. గత ఏడాది గణపవరంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటించిన తరుణంలో వైఎస్సార్ ఇచ్చిన ఇందిరమ్మ కాలనీలో సదుపాయాలు కల్పించాలని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు కోరిన నేపథ్యంలో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ ఉన్నతాధికారులతో కలిసి ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, మంత్రి జోగి రమేష్ భీమడోలులోని ఇందిరమ్మ కాలనీ ప్రాంతాన్ని పరిశీలించారు. కాలనీల లేఅవుట్ మ్యాప్‌ను పరిశీలించి కాలనీలోని మహిళలతో మాట్లాడి సమస్యలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. కాలనీలో ఇళ్ల లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణానికి అనుకూలంగా ఉండేందుకు నీటి సౌకర్యం, రోడ్లు, విద్యుత్, డ్రెయినేజీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. పాత ఇందిరమ్మ కాలనీలోని 800 మందికి అన్ని మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. ప్రత్యేక ఐడీ నంబర్ కల్పించి వీధిలైట్లు, రోడ్లు, మంచినీటి సదుపాయాలను కల్పిస్తామన్నారు. జగనన్న కాలనీ, పాత ఇందిరమ్మ కాలనీ వాసుల సౌకర్యార్థం జాతీయ రహదారికి అనుసంధానంగా గోదావరి కాల్వపై వంతెనను వచ్చే ఏడాది వేసవిలో నిర్మించేందుకు తగు చర్యలు తీసుకుంటామన్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీలన్నింటిని గెలిచిన తర్వాత తుంగలోకి తొక్కాడని, అయితే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన ప్రతి హామీను అమలు చేసి పేదల గుండెల్లో కొలువై ఉన్నాడన్నారు. ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు మాట్లాడుతూ వైఎస్ జగన్ ప్రభుత్వం పేదల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. పాత ఇందిరమ్మ కాలనీలో అన్ని సదుపాయాలు కలిపించడం ద్వారా ఈ ప్రాంతంలో 1100 గృహాలు కళకళలాడుతున్నాయన్నారు. తొలుత సర్పంచ్ పాము సునీతామాన్‌సింగ్ తదితర ప్రజాప్రతినిధులు సమస్యలపై విన్నతిపత్రాన్ని అందించారు. కాలనీలకు పక్కనే ఉన్న తామర చెరువు అక్రమణలకు గురైందని, ఆక్రమణలు తొలగించి ఈ కాలనీ వాసులకు మంచినీటి అవసరాల కోసం ట్యాంకు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. గృహ నిర్మాణ సంస్థ ఎండీ లక్ష్మీశా, పీడీ వేణుగోపాల్, విద్యుత్ శాఖ ఎస్ఈ సాల్మన్‌రాజు, ఈఈ టి.శశిధర్, నిర్మాణ విభాగం డీఈ వెంకటే శ్వరరావు, డీఈఈ కె.గోపాలకృష్ణ, సర్పంచ్ పాము సునీతామాన్‌సింగ్, ఎంపీపీ కనమాల రామయ్య, జెడ్పీటీసీ సభ్యులు తుమ్మగుంట భవానీ రంగ, మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, ఎంపీడీవో జీఎల్ఎన్‌వీ రాఘవన్, తహసీల్దార్ షంషూద్దీన్, రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, పసుపులేటి సత్యనారాయణ, ఏఈలు సతీష్, రామారావు పాల్గొన్నారు.

పోణంగి లేఅవుట్‌లో ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం


పోణంగి జగనన్న కాలనీలో విద్యుత్ సరఫరాకు స్విచ్ ఆన్ చేసి ప్రారంభిస్తున్న మంత్రి జోగి రమేష్, ఎమ్మెల్యే ఆళ్ల నాని

ఏలూరు (మెట్రో): ఏలూరు అర్బన్ లేఅవుట్ పరిధిలోని పోణంగి జగనన్న ప్రధాన అర్బన్ లేఅవుట్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్ (నాని)తో కలిసి రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ప్రారంభించారు. మంగళవారం లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణ పనుల ప్రగతిని మంత్రి జోగి రమేష్ పరిశీలించారు. ఇళ్ల కాలనీల్లో రూ.10 కోట్ల వ్యయంతో పూర్తి చేసిన విద్యుత్ పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం మంత్రి జోగి రమేష్, ఎమ్మెల్యే ఆళ్ల నాని, నగర మేయర్ షేక్ నూర్జహాన్ ఇళ్ల కాలనీల్లో మొక్కలు నాటారు. గృహనిర్మాణశాఖ స్పెషల్ సెక్రటరీ అజేయ్ జైన్, జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, ఎండీ లక్ష్మీషా, జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్, శాసనమండలి సభ్యులు జయమంగళ వెంకటరమణ, ఎమ్మెల్యేలు దూలం నాగేశ్వరరావు, వీఆర్ ఎలీజా, డిప్యూటీ మేయర్లు నూకపెయ్యి సుధీర్‌బాబు, గుడిదేశి శ్రీనివాస్, నగర కో–ఆప్షన్ మెంబరు ఎస్ ఎంఆర్ పెదబాబు, కార్పొరేటర్ దారావు అనూష, కార్పొరేటర్లు జుజ్జువరపు విజయనిర్మల, మునగాల కేదారీశ్వరినాని, మధ్యాహ్నపు బలరాం పాల్గొన్నారు.

23న గురుకులాల ప్రవేశ పరీక్ష

ఏలూరు (టూటౌన్): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులాల్లో 5వ తరగతి, జూనియర్ ఇంటర్‌లలో ప్రవేశానికై ఈ నెల 23న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల గురుకులాల సమన్వయకర్త పి.వాసవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఏలూరు జిల్లా పరిధిలో గల 7 అంబేద్కర్ గురుకులాల్లో, పశ్చిమగోదావరి జిల్లా పరిధిలోని 4 గురుకులాల్లో 5వ తరగతి, జూనియర్ ఇంటర్‌లో ప్రవేశాల కోసం ఈ పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. రెండు జిల్లాల్లో 5వ తరగతి సీట్లు 880 కొరకు మొత్తం 3,217 మంది విద్యార్థులు, జూనియర్ ఇంటర్ లోని 880 సీట్ల కొరకు 2,703 మంది విద్యార్థులు దరఖాస్తు చేశారన్నారు. ఈ నెల 23న ఐదో తరగతి ప్రవేశానికై ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశం కొరకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. ప్రశ్నాపత్రం ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుందన్నారు. హాల్ టిక్కెట్లను ఈ నెల 17 నుంచి వెబ్‌సైట్లో అందుబాటులో ఉంచామన్నారు. హాల్ టిక్కెట్ల డౌన్‌లోడ్‌లో ఇబ్బందులు ఎదురైన విద్యార్థులు వారు ఆన్‌లైన్‌లో అప్లికేషన్‌లో పొందుపర్చిన పరీక్షా కేంద్రానికి ముందుగా చేరుకుని నామినల్ రోల్స్‌లో వారి పేర్లను సరిచూసుకుని పరీక్షకు సరైన సమయంలో హాజరుకావాలని కోరారు. విద్యార్థులు హాల్ టికెట్‌తోపాటు ఆధార్ కార్డు, బ్లూ లేదా బ్లాక్ బాల్‌పాయింట్ పెన్ తెచ్చుకోవాలని, పరీక్ష కేంద్రానికి ఒక గంట ముందుగా చేరుకోవాలని వాసవి సూచించారు. ఇతర వివరాల కొరకు 99893 94224, 97048 26744 సెల్ నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

తూతూమంత్రంగా విచారణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యార్థినులపై లైంగిక దాడికి పాల్పడిన ఘటనలో బాధ్యుడైన ఉపాధ్యాయ సంఘం నాయకుడైన ఉపాధ్యాయుడిని కాపాడేందుకు జిల్లా విద్యాశాఖాధికారులు ప్రయత్నాలు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. శ్రీరామ్‌నగర్ ఎంపీయూపీ స్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పీవీ నరసింహారావు లైంగికదాడికి పాల్పడగా ఈ ఘటనపై ఈనెల 10న హెచ్‌ఎం ఎంఈఓ సబ్బితి నరసింహమూర్తికి ఫిర్యాదు చేయగా, ఆయన డీఈఓ దృష్టికి తీసుకువెళ్ళారు. దీనిపై కార్యాలయ ఏడీ షరీఫ్‌ను విచారణాధికారిగా నియమించగా, మంగళవారం ఆయన పాఠశాలకు వెళ్లి బాలికలను, హెచ్‌ఎంను విచారణ చేశారు. ఈ విచారణ తూతమంత్రంగా జరిగిందని విమర్శిస్తున్నారు. సదరు ఉపాధ్యాయుడి నుంచి పెద్ద మొత్తంలో వసూలు చేసి అతనిని రక్షించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. సదరు ఉపాధ్యాయుడు క్షమాపణ పత్రం రాసివ్వడంతో సరిపెట్టకుండా ఈ ఘటనను జిలా కలెక్టర్ తీవ్రంగా పరిగణించి జ్యూడీషియల్ విచారణ చేపట్టాలని వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకుడు గెడ్డం సుధీర్ డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుడి నుంచి ముడుపులు తీసుకుని అతనిని రక్షించడానికి ప్రయత్నిస్తున్న అధికారులపై కూడా విచారణ చేయాలని కోరారు.

నీటి తొట్టెలో పడి బాలుడి మృతి


బాలుడు జాన్ బోస్ మృతదేహం


బాలుడు పడిపోయిన నీటి తొట్టె ఇదే

ద్వారకాతిరుమల: అప్పటివరకు ఇంటి ఆవరణలో ఆడుతూ గడిపిన బాలుడిని అంతలోనే మృత్యువు నీటి తొట్టె రూపంలో మింగేసింది. స్థానికుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. దొరసానిపాడుకు తానిగడప రాంబాబు, లత దంపతులకు జాన్ బోస్ (4) ఒక్కడే సంతానం. మంగళవారం సాయంత్రం బాలుడి తల్లి లత రోజులానే కూలి పనులకు వెళ్లగా, తండ్రి రాంబాబు ఇంట్లో నిద్రిస్తున్నాడు. అమ్మమ్మ దిర్శిపాం చుక్కమ్మ పక్కింటికి వెళ్లింది. అదే సమయంలో ఇంటి ఆవరణలో ఆడుకుంటున్న బాలుడు నీటి తొట్టె వద్దకు వెళ్లగా అందులో కొబ్బరి బొండం చూసి దానిని అందుకునేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు తొట్టెలో పడిపోయాడు. ఇదిలా ఉంటే కొద్దిసేపటికి నిద్రలేచిన తండ్రి రాంబాబు బాలుడి కోసం వెతుకుతూ నీటితొట్టె వద్దకు వెళ్లి చూడగా, అందులో బాలుడు తేలుతూ కనిపించాడు. వెంటనే బయటకు తీసి చుట్టుపక్కల వారి సాయంతో ద్వారకాతిరుమల పీహెచ్‌సీకి తీసుకువెళ్లాడు. అప్పటికే బాలుడు మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. బాలుడి మృతితో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా రోదించారు.

కుమారుడు, బావమరిది చేతిలో వ్యక్తి హతం


గాంధీ మృతదేహం

ఆగిరిపల్లి: కుమారుడు, బావమరిది చేతిలో వ్యక్తి హతమైన సంఘటన మండలంలోని కొమ్మూరులో మంగళవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఆరేపల్లి గాంధీ (48) గతంలో డ్రైవర్‌గా పనిచేశాడు. అతనికి భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మూడేళ్ల నుంచి మద్యం తాగుతూ ఏ పనికి వెళ్లకుండా ఇంటి వద్దే ఉంటున్నాడు. గాంధీ ప్రతిరోజు మద్యం తాగి భార్య రాజేశ్వరిని, పిల్లలను హింసిస్తుండేవాడు. ఈ నెల 17న మద్యానికి డబ్బులు ఇవ్వలేదని భార్యతో గొడవపడగా రెండో కుమారుడు అనిల్‌కుమార్ అడ్డుకున్నాడు. అదేరోజు సాయంత్రం సెల్‌ఫోన్, కోడిపుంజులను అమ్మి ఆ డబ్బుతో మద్యం తాగి భార్యతో గొడవపడ్డాడు. భర్త ప్రవర్తనతో భయపడిన భార్య మల్లవల్లిలో ఉంటున్న చిన్న కుమార్తె ఇంటికి వెళ్లింది. అదే రోజు రాత్రి 9 గంటల సమయంలో గాంధీకి, అతని రెండో కుమారుడు అనిల్‌కుమార్, భార్య తమ్ముడైన వేముల శ్రీనివాసరావులకు మధ్య గొడవ జరిగింది. ఈ గొడవలో గాంధీని అతని కుమారుడు అనిల్‌కుమార్, బావమరిది శ్రీనివాసరావు ఇంటి ఎదురుగా ఉన్న స్తంభానికి కట్టి విచక్షణారహితంగా కర్రలతో దాడి చేశారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన గాంధీ మంగళవారం మృతి చెందాడు. తన భర్త మృతికి తన కుమారుడు, తమ్ముడు కారణమని భార్య రాజేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై ఎస్.చంటిబాబు కేసు నమోదు చేయగా, నూజివీడు రూరల్ సీఐ ఆర్.అంకబాబు దర్యాప్తు చేస్తున్నారు.

గోదావరిలో మునిగి ఇద్దరు విద్యార్థుల మృతి

- పరీక్షలు ముగిశాయన్న ఆనందంతో స్నానానికి వచ్చి మునక
- స్నేహితుడిని రక్షించే ప్రయత్నంలో ఇద్దరూ మృత్యుఒడికి..


భానుప్రసాద్, గిరిధర్‌ల మృతదేహాలు

ఆచంట (పెనుగొండ): పదో తరగతి పరీక్షలు ముగిశాయన్న ఆనందంతో స్నానం చేయాలని వచ్చిన ఇద్దరు విద్యార్థులు గోదావరిలో మునిగి ప్రాణాలు కోల్పోయారు. వివరాలిలా ఉన్నాయి. ఆచంట మండలం వల్లూరుకు చెందిన ఉమామహేశ్వరరావు కుమారుడు కామిశెట్టి గిరిధర్, కొండేపూడి శ్రీను అలియస్ విక్టర్ బాబు కుమారుడు భానుప్రసాద్, మరో ముగ్గురు స్నేహితులతో కలసి భీమలాపురంలో మంగళవారం సాయంత్రం గోదావరిలో స్నానానికి వెళ్లారు. అయితే ఏటి గట్టు ప్రాంతంలో పాయ నీరు బాగుండలేదన్న ఉద్దేశంతో మధ్యలో ఉన్న పాయ వద్దకు వెళ్లి స్నానానికి దిగారు. ఈ తరుణంలో కామిశెట్టి గిరిధర్ నదిలో లోతు అంచనా తెలియక మునిగిపోతున్న తరుణంలో మరో స్నేహితుడు కొండేపూడి భానుప్రసాద్ మునిగిపోతున్న గిరిధర్‌ను రక్షించడానికి ప్రయత్నిస్తూ మృత్యువాత పడ్డాడు. దీంతో మిగిలిన ముగ్గురూ అప్రమత్తమై రక్షించమని కోరగా దగ్గరలో ఎవరూ లేకపోవడంతో ఫలితం లేకుండా పోయింది. స్థానికులు గల్లంతైన విద్యార్థుల కోసం గాలించగా, సాయంత్రం వీరి మృతదేహాలు లభ్యమయ్యాయి. మృతదేహాలను వారి బంధువులు స్వగ్రామమైన వల్లూరు తరలించారు. కామిశెట్టి గిరీష్ తండ్రి జీవనోపాధి నిమిత్తం గల్ఫ్‌లో ఉండడంతో ఇక్కడ తల్లి సంరక్షణలో ఉన్నాడు. భానుప్రసాద్ తల్లిదండ్రులు ఇద్దరూ గల్ఫ్‌లో ఉండడంతో నానమ్మ వద్ద ఉంటున్నాడు. గ్రామంలో ఇద్దరు విద్యార్థులు మృతి చెందడంతో విషాదఛాయలు అలుముకున్నాయి.

బందోబస్తులో పోలీసులు

తూర్పువిప్పర్రులో శాంతిభద్రతల సమస్య తలెత్తడంతో బందోబస్తుకు వెళ్లిన పెనుగొండ ఎస్సై ఎంరాజ్‌కుమార్ విషయం తెలుసుకుని సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. వల్లూరు వెళ్లి కేసు నమోదు చేశారు.

మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు ఆరా

విద్యార్థులు మృతి చెందిన సంఘటనపై మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆరా తీశారు. సత్వరం అధికారులు కుటుంబ సభ్యులకు అండగా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు ప్రస్తుతం తమిళనాడు రాష్ట్రంలో ఉండడంతో ఫోన్‌లోనే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ఆక్వా రంగానికి అండగా ప్రభుత్వం

జిల్లా ఆక్వా వెల్ఫేర్ అసోసియేషన్ అభినందన సభలో అప్సడా వైస్ చైర్మన్ వడ్డి రఘురామ్


రఘురామ్‌ను సత్కరిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: ఆక్వా రంగానికి ప్రభుత్వం అండగా నిలవడం వల్లే నేడు ఆక్వా రైతులు ఆనందంగా ఉన్నారని అప్సడా వైస్ చైర్మన్ వడ్డి రఘురామ్ స్పష్టం చేశారు. ఆక్వా రంగానికి విద్యుత్ సబ్సిడీ ఇస్తున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపేందుకు ఆక్వా రైతుల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వడ్డి రఘురామ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 4.65 లక్షల ఎకరాల్లో రొయ్యల సాగుచేస్తుండగా, 64వేలకు పైగా విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయని, వాటిలో 46 వేల కనెక్షన్లకు సబ్సిడీ వర్తిస్తోందని చెప్పారు. ప్రభుత్వంపై అధిక భారం పడుతున్నా రైతులకు అండగా నిలవాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యుత్ సబ్సిడీని అమలు చేస్తున్నారని వివరించారు. ఆక్వా రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేకంగా అప్సడాను ఏర్పాటు చేసిందన్నారు. కరోనా సమయంలో రొయ్యల రైతులు అనేక సమస్యలతో నష్టాలను చవిచూశారన్నారు. ఇటువంటి తరుణంలో ముఖ్యమంత్రి జోక్యంతో రొయ్యల కొనుగోలుకు, మేతలు, సీడ్ ధరలు తగ్గించడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో ఆక్వా రంగం నిలదొక్కుకుందన్నారు. స్థానికంగా ఆక్వా ఉత్పత్తుల వినియోగాన్ని పెంచేందుకు ఫిష్ ఆంధ్రా యూనిట్స్ ఏర్పాటుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి అప్సడా కృషి చేస్తుందన్నారు. అసోసియేషన్ జిల్లా కార్యదర్శి గాదిరాజు వెంకట సుబ్బరాజు (కేజీఎఫ్) మాట్లాడుతూ నాన్ ఆక్వా జోన్‌లో సైతం విద్యుత్ సబ్సిడీ ఇచ్చేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో ఆక్వా రైతులంతా ప్రభుత్వానికి రుణపడి ఉంటారన్నారు. అసోసియేషన్ జిల్లా జాయింట్ సెక్రటరీ రుద్రరాజు యువరాజు మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయంతో రైతులు ఆనందంగా ఉన్నా సీడ్, ఫీడ్ ధరలపై నియంత్రణ లేకపోవడంతో అధిక ధరలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు నంబూరి గజపతిరాజు అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో రఘురామ్, మత్స్యశాఖ అధికారులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు నాగభూషణం, గాదిరాజు సుబ్బరాజు, గోపాలకృష్ణంరాజు, వీరవల్లి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

క్రికెట్ బెట్టింగ్ ముఠా అరెస్టు

తణుకు: తణుకు పట్టణంలో క్రికెట్ బెట్టింగులు నిర్వహిస్తున్న ఐదుగురు ముఠా సభ్యులను మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. పట్టణ సీఐ ముత్యాల సత్యనారాయణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పాతవూరులోని పాత ఏకేటీపీ స్కూలు సమీపంలో గూడూరి కృష్ణయ్య ఇంట్లో గది అద్దెకు తీసుకుని క్రికెట్ బెట్టింగులు నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో పోలీసులు దాడి చేశారు. బెట్టింగులు నిర్వహిస్తున్న బంగారు సాయిప్రసాద్, గొర్రెల కాశేశ్వరరావు, మాదలవలస సాయిదుర్గాప్రసాద్, మెరుగుపురుగు ప్రదీప్, ఇళ్ల చందులను అరెస్టు చేసి వారి వద్ద రూ. 17,300 నగదు, 12 సెల్ ఫోన్లు, ఒక ల్యాప్‌టాప్, శాంసంగ్ టాబ్, మూడు మోటర్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్లు సీఐ వెల్లడించారు.

ఇంటర్ విద్యార్హతతో ఉద్యోగావకాశాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ హెచ్‌సీఎల్ టెక్నాలజీస్‌లో ఇంటర్మీడియట్ విద్యార్హతతో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.చంద్రశేఖరబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 22న ఏలూరులోని సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం 8.30 గంటల నుంచి జాబ్ మేళా నిర్వహిస్తారన్నారు. 2022, 2023 విద్యా సంవత్సరాల్లో ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ జాబ్ మేళాకు హాజరుకావచ్చన్నారు. ఇంటర్‌లో ఎంపీసీ, ఎంఈసీ గ్రూపులు చదివి 75 శాతం మార్కులతో, గణితంలో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన విద్యార్థులు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా నియామకం పొందవచ్చన్నారు. ఇంటర్ బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఒకేషనల్ గ్రూపుల్లో చదివిన విద్యార్థులు సైతం జాబ్‌మేళాకు హాజరుకావచ్చన్నారు. ఆధార్‌కార్డు జిరాక్స్, 2 పాస్‌పోర్ట్ ఫొటోలు, టెన్త్, ఇంటర్ వెంట తీసుకురావాలన్నారు. 85550 85030 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

పోలీస్‌స్టేషన్ వద్ద దళిత నేతల ఆందోళన


పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న దళిత నేతలు

యువతికి న్యాయం చేయాలంటూ డిమాండ్

మొగల్తూరు: తమ సామాజిక వర్గానికి చెందిన యువతికి న్యాయం చేయాలని కోరుతూ దళిత నాయకులు మంగళవారం పోలీసుస్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బాధిత యువతి విలేకరులతో మాట్లాడుతూ శ్రీరామపురం పంచాయతీ బాబాయిపల్లికి చెందిన తాను గ్రామంలో వలంటీర్‌గా విధులు నిర్వహిస్తున్న సమయంలో అదే గ్రామానికి చెందిన అగ్రవర్ణ కులానికి చెందిన యువకుడు తనను ప్రేమిస్తున్నానని, పెళ్లి కూడా చేసుకుంటానని నమ్మించాడని తెలిపింది. అయితే బెంగుళూరులో మరో ఉద్యోగం రావడంతో వలంటీర్ ఉద్యోగాన్ని వదిలి తాను వెళ్లిపోయినా యువకుడు అక్కడకు వచ్చి మాయమాటలు చెప్పి ఉద్యోగం మాన్పించాడన్నారు. ఇదే సమయంలో తన వద్ద రూ.3 లక్షల నగదు, రూ.1.50 లక్షలు విలువ చేసే బంగారు నగలు ఇచ్చానని పేర్కొంది. అయితే ఇటీవల తనని పెళ్లి చేసుకోమని కోరగా, నిరాకరించడంతో పాటు తాను అగ్రవర్ణానికి చెందిన వాడినని, పెళ్లికి తమ ఇంట్లో ఒప్పుకోరని చెప్పాడని వాపోయింది. తనకు ఆ యువకునితో వివాహం జరిగే వరకు ఆందోళన విరమించేది లేదని, న్యాయం జరగకపోతే స్టేషన్ వద్దే ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించింది. ఇదే విషయంపై సీఐ సురేష్‌బాబును వివరణ కోరగా బాధిత యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు యువకుడిని అదుపులోకి తీసుకున్నామని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు కావడంతో డీఎస్పీ కేసు నమోదు చేసి విచారణ చేయాల్సి ఉందన్నారు. అయితే ఇరువర్గాల వారితో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు.

దూరవిద్య ప్రయోగ పరీక్షలకు 363 మంది హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏపీసార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో దూరవిద్యా విధానంలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా మంగళవారం నుంచి ప్రయోగ పరీక్షలు ప్రారంభమయ్యాయి. భౌతికశాస్త్ర పరీక్షకు 220 మందికిగాను 190 మంది పాల్గొనగా, 30 మంది గైర్హాజరయ్యారు. రసాయన శాస్త్రం పరీక్షకు 2,103 మందికి గాను 173 మంది హాజరు కాగా 40 మంది గైర్హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్‌వీ రవిసాగర్ తెలిపారు.

నలుగురు వ్యక్తులపై కేసు నమోదు

పెనుమంట్ర: పాలమూరు ఇన్‌చార్జి గ్రామకార్యదర్శి ఎస్.మోహన్‌రావు చేసిన ఫిర్యాదు మేరకు నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై బి.సురేంద్రకుమార్ తెలిపారు. ఈనెల 14న గ్రామసభ నిర్వహిస్తుండగా ఏలేటి అనిల్‌కుమార్, పాలపర్తి లక్ష్మణరావు, తోరం వెంకన్నబాబు, కలిదిండి శిరీషరాజు గ్రామసభలో అల్లరిచేస్తూ అధికారుల విధులకు కూడా అడ్డుతగిలారన్నారు. గ్రామసభలో దౌర్జన్యానికి పాల్పడి తమ విధులను ఆటంకపరిచారని మోహనరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న డిపో మేనేజర్, సత్యసాయి సేవా సమితి సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని సత్య సాయి సేవాసమితి ఆధ్వర్యంలో మంగళవారం ఆర్టీసీ బస్సు కాంప్లెక్స్‌లో చలివేంద్రంను డిపో మేనేజర్ వైఎస్ఎన్ మూర్తి చేతుల మీదుగా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వేసవి ఎండలు, కాంప్లెక్స్‌కు వచ్చే ప్రయాణికులను దృష్టిలో పెట్టుకొని ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా సేవలు అందిస్తున్న సత్యసాయి సేవా సమితి సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమితి తరుపున కన్వీనర్ ఎంఎస్ఎస్‌కే జనార్ధనరావు, ఆకుల నవీన్ బాబా, ప్రవా శ్రీనివాస్, టి.శోభనాద్రిరావు, మల్లిఖార్జునరావు, ముత్యాలరావు, పాలూరి రాంబాబు, వంశీకృష్ణ, మహిళా సభ్యులు పాల్గొన్నారు. .

ఉచిత వైద్య శిబిరం



తణుకులో వైద్యసేవలందిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: సజ్జాపురం సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక రాష్ట్రపతి రోడ్డులోని అసోసియేషన్ భవనంలో నిర్వహించిన ఈ శిబిరానికి హాజరైన 31 మంది రోగులకు వైద్యులు డాక్టర్ భూపతిరాజు రమేష్‌చంద్రబాబు, డాక్టర్ పుల్లెపు సత్యనారాయణమూర్తి వైద్యసేవలందించారు. ఉచితంగా బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. ప్రతి మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ శిబిరం నడుస్తుందని వృద్ధులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని జిల్లా అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ సూచించారు. అసోసియేషన్ సభ్యులు కోసూరి గాంధీ, పెన్మెత్స సత్యనారాయణరాజు, కె.సాధు, ఐవటూరి లక్ష్మణరావు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం



పేదలకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్ క్లబ్ సేవలు స్ఫూర్తిదాయకం, అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. లయన్స్ ఇంటర్నేషనల్ సూచనలు మేరకు మాజీ జిల్లా గవర్నర్‌లకు గౌరవ సత్కారాల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని లయన్స్‌క్లబ్ హాల్‌లో లయన్స్‌క్లబ్ మాజీ జిల్లా గవర్నర్ ఓపీ గోయెంకాను ఘనంగా సత్కారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరన్ని సేవలు లయన్స్‌క్లబ్ అందించాలని సూచించారు. ఈ సందర్భంగా పేదలకు సేవా కార్యక్రమాల్లో నిత్యావసర వస్తువులు అందించారు. ఈ కార్యక్రమంలో సన్నిధి సూర్యనారాయణ మూర్తి, దాట్ల లక్ష్మీపతిరాజు, డీవీపీ విశ్వేశ్వరరావు, వంగపండు రామ్మోహన్‌రావు, చిన్నం మణీంద్ర, జగదీష్, పదంకుమార్ గుప్తా, గ్రంధి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ కూలీల సమస్యలను పరిష్కరించాలి



అత్తిలి మండలం గుమ్మంపాడులో ఉపాధి హామీ కూలీల సమస్యలపై ధర్నా చేస్తున్న దృశ్యం

అత్తిలి: ఉపాధిహామీ కూలీల సమస్యలను పరిష్కరించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చినవీరభద్రం తెలిపారు. మంగళవారం అత్తిలి మండలం గుమ్మంపాడు పంటకాలువలో తూడు తొలగిస్తున్న కూలీలను ఆయన కలిసి వారితో కొద్దిసేపు మాట్లాడి, పనిలో ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్‌లను పర్మినెంట్ చేసి, కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విత్తంశెట్టి అప్పలనాయుడు, గొల్లపల్లి ఆమోస్, అడ్డగర్ల వెంకట రాధాకృష్ణ, వినుకొండ పెద నాగేశ్వరరావు, బంగారు లక్ష్మి, చినమిల్లి రామలక్ష్మి, యాళ్ల బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

20న రగ్బీ జిల్లా జట్ల ఎంపిక

నరసాపురం రూరల్: కర్నూలు జిల్లాలో ఈ నెల 30, మేనెల 1వ తేదీల్లో నిర్వహించనున్న 8వ రాష్ట్రస్థాయి జూనియర్ బాలబాలికల రగ్బీ పోటీల్లో పాల్గొనే క్రీడాకారుల నుంచి పశ్చిమ గోదావరి జిల్లా జట్టు ఎంపిక చేస్తామని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మరడాన అచ్యుతరావు తెలిపారు. ఈనెల 20న గురువారం నరసాపురం రుస్తుంబాదలోని అభ్యాస్ స్కూల్లో జిల్లా జట్టు ఎంపిక చేస్తామన్నారు.

సెగ.. భగలు

- మండిపోతున్న ఎండలు
- 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు
- అల్లాడిపోతున్న ప్రజలు

పెంటపాడు: జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. రోజురోజుకూ వేసవి తీవ్రత పెరుగుతోంది. ఏప్రిల్ మూడోవారంలోనే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 7 గంటలకే భానుడు ఉగ్ర రూపం దాల్చుతున్నాడు. ఉదయం 10 గంటలకే రోడ్లపైకి రాకపోకలు తగ్గుతున్నాయి. సాయంత్రం 5 గంటల వరకు ఎండ తీవ్రత కొనసాగుతోంది. అధికంగా ఎండ, ఉక్కపోత వల్ల ప్రజలు అల్లాడిపోతున్నారు. అత్యవసర పనులు ఉంటే మినహా ఇంటి నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. నిర్మానుష్యంగా రహదారులు ఉంటున్నాయి. ఎండ తీవ్రతను తట్టుకోలేక 16వ నెంబర్ జాతీయరహదారిపై ప్రయాణించే వాహనదారులు ఎండ తీవ్రత సమయంలో రోడ్లకు ఇరువైపులా చెట్లకింద వాహనాలు నిలిపివేసి సేదదీరుతున్నారు. ఫలితంగా ప్రధాన కూడళ్లు నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. అత్యవసర పనులపై బయటకు వచ్చేవారు ఎండ నుంచి రక్షణగా గొడుగులు, క్యాప్‌లు వంటి రక్షణ సాధనాలను వినియోగిస్తున్నారు. ఎండ నుంచి రక్షణ పొందేందుకు వీలుగా శీతల పానీయాలను ఆశ్రయిస్తున్నారు. ఫలితంగా జ్యూస్‌సెంటర్లు, కొబ్బరిబొండాల వ్యాపారాలు జోరుందుకున్నాయి. మరో పక్క వచ్చే నెలాఖరులో ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయనే హెచ్చరికలను వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. ఏప్రిల్ నెలలోనే ఎండలు ఇలా ఉంటే మే నెల ప్రారంభం నుంచి చివరి వరకు పరిస్థితి ఎంత భయంకరంగా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఈ జాగ్రత్తలు తీసుకొంటే మేలు

- ఎండలో బయటకు వెళ్లేటప్పుడు గొడుగును తీసుకెళ్లాలి.
- పలుచని తెలుపు రంగు కాటన్ వస్త్రాలు ధరించాలి.
- తలకు టోపీ పెట్టుకోవాలి లేదా రుమాలు చుట్టుకోవాలి.
- ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆరుబయట అధికశ్రమతో కూడిన పనులు చేయరాదు.
- మజ్జిగ, నిమ్మరసం, మంచినీరుతో పాటు, ఓఆర్ఎస్ ద్రావణం, శీతల పానీయాలు వెంట తీసుకెళ్లాలి.
- వడదెబ్బ తగిలినవారికి వెంటనే వైద్యపరీక్షలు చేయించాలి.
- ఎక్కువగా నీరు, ద్రవపదార్థాలు సేవించాలి.
- ఎండలో పనిచేయాల్సి వచ్చినప్పుడు ప్రతీ 20 నిముషాలకు ఒకసారి ద్రవ పదార్థాలు తీసుకోవాలి.

వడగాడ్పులతో జాగ్రత్త



రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. వడగాడ్పులు వీస్తున్నాయి. మే నాటికి ఈ తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉంది. ఎండలలో పనిచేసేవారికి, తిరిగేవారికి వడదెబ్బ తగిలే ప్రమాదముంది. ఎవరైనా వడదెబ్బకు గురైతే వెంటనే నీడ ప్రదేశానికి చేర్చాలి. తడి క్లాత్‌తో శరీరమంతా తుడిచి, చల్లని గాలి తగిలే విధంగా చూడాలి. ఓవర్ రిహైడ్రేషన్ (ఓఆర్ఎస్) ద్రావణం తాగించి, వీలైనంత త్వరగా వైద్యులను సంప్రదించాలి. పీహెచ్‌సీల్లో అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేస్తున్నాం.

– ఎన్వీ రమణ, ప్రభుత్వ ప్రాథమిక వైద్యాధికారి, ముదునూరు పీహెచ్‌సీ



ప్రత్తిపాడు వద్ద జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలు లేక నిర్మానుష్యమైన దృశ్యం



గూడెం పోలీస్ ఐలండ్ సెంటర్లో ఎండకు తట్టుకోలేక జనసమర్థ్యం లేని దృశ్యం

నాయీబ్రాహ్మణులు సంఘాభివృద్ధికి పాటుపడాలి

అత్తిలి: నాయీబ్రాహ్మణులు సంఘటితంగా ఉండి సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని బీసీ జేఏసీ చైర్మన్ లంక వెంకటేశ్వరరావు చెప్పారు. మంగళవారం అత్తిలి పట్టణ నాయీబ్రాహ్మణ సేవా సంఘం నూతన కమిటీ ఎన్నిక స్థానిక సంఘ భవనంలో జరిగింది. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నాయీబ్రాహ్మణ సేవా సంఘం నూతన కార్యవర్గసభ్యులు సంఘాభివృద్ధికి పాటుపడాలన్నారు. నూతన కమిటీ అధ్యక్షునిగా పసుమర్తి సీతాంబరం, ఉపాధ్యక్షునిగా కొడవర్తి సురేష్, సెక్రటరీగా అయినపర్తి వెంకటేశ్వరరావు, జాయింట్ సెక్రటరీగా చీపురపల్లి సాయిసతీష్, కోశాధికారిగా పోలవరపు కుమార్, జాయింట్ కోశాధికారిగా అయినవల్లి ఏసురాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంఘ ఉపాధ్యక్షుడు వర్తనపల్లి కాశీ, తురాయిశ్రీను, నాయిబ్రాహ్మణులు పాల్గొన్నారు.

24 నుంచి క్రీస్తు రక్షణ సువార్త కూడికలు

పెంటపాడు: గూడెంలోని కడకట్ల క్రైస్ట్‌మాస్ లూథరన్ చర్చి ఆధ్వర్యంలో ఈనెల 24 నుంచి రెండు రోజులు పాటు క్రీస్తు రక్షణ సువార్త కూడికలు నిర్వహించనున్నట్లు సభల కన్వీనర్ బుంగా విద్యాసాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ ఇమ్మానియేలు మినిస్ట్రీస్‌కు చెందిన పాస్టర్ జెర్మియా ఈ సభలలో దేవుని వాక్యం అందిస్తారన్నారు. గూడెం ఫ్లెటైవర్‌బ్రిడ్జి, సబ్‌స్టేషన్ వద్ద ప్రతి రోజూ సాయంత్రం 6 గంటలకు నిర్వహించబోయే ఈ సమావేశాలను క్రైస్తవభక్తులు, విశ్వాసులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రైతులకు సకాలంలో ధాన్యం సొమ్ములు



కొమ్ముగూడెం సొసైటీ వద్ద రైతులకు ట్రక్ షీట్ ఇస్తున్న సొసైటీ చైర్మన్ వెలిశెట్టి నరేంద్రకుమార్

తాడేపల్లిగూడెం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన, కొద్ది రోజులకే సొమ్ములు వారి ఖాతాలకు జమ చేసేందుకు చర్యలు తీసుకుంటుందని కొమ్ముగూడెం సొసైటీ చైర్మన్ వెలిశెట్టి నరేంద్రకుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని కొమ్ముగూడెం సొసైటీ పరిధి ఎనిమిది రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతులకు ట్రక్ షీట్లను అందజేశారు. ఈ సందర్భంగా నరేంద్రకుమార్ మాట్లాడుతూ సొసైటీ పరిధిలో కొమ్ముగూడెం, పట్టెంపాలెం, వీరంపాలెం, నీలాద్రిపురం, కడియద్ద, జగ్గన్నపేట, అప్పారావుపేట, మోదుగ గుంట గ్రామాలు ఉన్నాయన్నారు. ఆయా గ్రామాల రైతుల నుంచి ధాన్యం సేకరించడం జరుగుతుందన్నారు. అలాగే సకాలంలో ధాన్యం సొమ్ములు చెల్లించనున్నట్టు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని మద్దతు ధర పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈవో సీహెచ్‌ఎస్‌వీ.కృష్ణ శర్మ, వీఏఏ రాజు, సొసైటీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రజలకు సేవలందించడమే లక్ష్యం



తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కొట్టు విశాల్

తాడేపల్లిగూడెం అర్బన్ : ప్రజలకు సేవలందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని వైఎస్సార్‌సీపీ యువనేత కొట్టు విశాల్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో మంగళవారం చలివేంద్రాన్ని కొట్టు విశాల్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చేవారితో సహాయకులుగా వచ్చేవారికి చలివేంద్రాలు ఉపకయోగకరంగా ఉంటాయన్నారు. వేసవికాలం కావడంతో ఎండలు మండుతున్నాయన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి మంచినీరు అందించడం అవసరమన్నారు. కొట్టు సత్యనారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో ప్రజలకు పలు సేవా కార్యక్రమాలను అందిస్తున్నామన్నారు. రోగుల సౌకర్యార్థం ఆసుపత్రికి అవసరమైన సౌకర్యాలను ఏర్పాటు చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. ఆసుపత్రి వైద్యులు పి.సూర్యనారాయణ, సాంబశివరావు, సాంబశివ నాయక్, నాయకులు కర్రి భాస్కరరావు, కొట్టు సత్యనారాయణ, గిరిబాబు, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దోమలను తరిమికొడదాం



కృష్ణాయపాలెంలో దోమల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: పరిశుభ్రతను పెంపొందించి దోమలను తరిమికొట్టాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు అన్నారు. మంగళవారం మండలంలోని కృష్ణాయపాలెం గ్రామంలో ఫీవర్ సర్వే, వెక్టార్ కంట్రోల్, హైజీన్ కార్యక్రమాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ దోమల నివారణతో వ్యాధులను అరికట్టవచ్చన్నారు. నీటి కుంటలు ఉన్న ప్రాంతాల్లో అబేట్ స్ప్రే చేయాలని సూచించారు. దోమల నివారణలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. రాత్రి సమయాల్లో దోమలు కుట్టకుండా దోమతెరలను వినియోగించాలన్నారు. ఆరోగ్య పర్యవేక్షకులు జి.రామకృష్ణ, ఎస్.అశోక్‌బాబు, ఆరోగ్య సహాయకులు కె.లక్ష్మణరావు, కాంతారావు, ఆశా కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

అమృత్‌సర్వ్ పనులు త్వరగా పూర్తి చేయాలి



ఉనికిలి గ్రామంలో చెరువుపూడిక తీత పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో రామారావు

అత్తిలి: యుద్ధప్రాతిపదికన అమృత్‌సర్వ్ చెరువులు పూర్తి చేయాలని, గట్లు మరింత బలంగా ఉండేలా చూడాలని ఎంపీడీవో వీవీవీఎస్ రామారావు తెలిపారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో ఉనికిలి గ్రామంలో చేపట్టిన చెరువుపూడిక తీత పనులను ఎంపీడీవో మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ కూలీలకు వేసవి కాలభృతి, కొలతలు, రాజీలేని అంశాలపై కూలీలతో ముఖాముఖిగా చర్చించారు. కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేయాలని ఆదేశించారు. పని ప్రదేశంలో ప్రథమ చికిత్స బాక్సులు లేకపోవడం పట్ల ఎంపీడీవో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వట్టికూటి అనంతలక్ష్మి, కార్యదర్శి ఫణిరాజు, ఫీల్డ్ అసిస్టెంట్ తేలి శాంతి స్వరూప్, మండల పరిషత్ సిబ్బంది శ్రీనివాస్, లావణ్య, దివ్య, మార్కండేయులు, గిరి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతో అగ్ని ప్రమాదాల నివారణ



తిరుపతిపురం మెరైన్ కంపెనీ వద్ద అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అత్తిలి: చిన్నపాటి జాగ్రత్తలు పాటిస్తే అగ్ని ప్రమాదాలను నివారించవచ్చని అత్తిలి అగ్నిమాపక అధికారి సీహెచ్ రాజంరాజు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం అత్తిలి మండలం తిరుపతిపురం గ్రామంలో ఏవీఆర్ మెరైన్ కంపెనీలో వర్కర్స్, యాజమాన్యానికి ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫైర్ ఆఫీసర్ రాజంరాజు మాట్లాడుతూ వేసవిలో అగ్నిప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉన్నందున ప్రమాదాల నివారణకు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అగ్నిప్రమాదాలు సంభవించినపుడు మంటలు చెలరేగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మంటల్లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

తణుకు: అగ్ని ప్రమాదాల నివారణపై ప్రతిఒక్కరు అవగాహన కలిగి ఉండాలని తణుకు అగ్నిమాపక అధికారి ఐ.అజయ్‌కుమార్ కోరారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక వై జంక్షన్ వద్ద పెట్రోలు బంకులో అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు జరిగిన సమయంలో తీసుకోవాల్సిన చర్యలతో పాటు మంటలను ఆర్పే విధానంపై సిబ్బందికి అవగాహన కల్పించారు. వాహనదారులకు కరపత్రాలు పంపిణీ చేశారు. పెట్రోలు బంక్ సిబ్బంది, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలని వినతి



తణుకులో మంత్రి కారుమూరికి వినతిపత్రం అందిస్తున్న వీఆర్ఏలు

తణుకు అర్బన్: వీఆర్ఏల సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావుకు వినతి పత్రం అందచేశారు. మంగళవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి కారుమూరిని కలిసిన తణుకు నియోజకవర్గంలోని తణుకు, ఇరగవరం, అత్తిలి మండలాల వీఆర్ఏలు ఏళ్ల తరబడి తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. స్పందించిన మంత్రి కారుమూరి మీ డిమాండ్లను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చినట్లు వీఆర్ఏలు తెలిపారు. వీఆర్ఏలు కోట్లు ప్రసన్న మల్లయ్య, బలరాం, శ్రీకాంత్, ఏసురత్నం, జాన్ మోషే, సీమయ్య, గెడ్డం సుబ్బారావు, వెంకన్న, బోసు, పోసి, సందీప్ పాల్గొన్నారు.

గృహనిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

ఇరగవరం: జగనన్న గృహనిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం ఇరగవరం ఎంపీడీవో కార్యాలయంలో 21గ్రామాల్లోని అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఇళ్లు నిర్మించుకొనే లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు అందేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆయుష్మాన్ భారత్ సర్వే పూర్తి చేసి ఐడి కార్డులు అందించాలన్నారు. మిషన్ వాత్సల్యలో వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ గ్రామాల్లో నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం జరగాలని ఆదేశించారు. కార్యదర్శులు, ఏఎన్ఎంలు, మహిళ పోలీసులు,వెల్ఫేర్ అసిస్టెంటులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఈవోపీఆర్‌డీ వై ముని రాజు, సీనియర్ అసిస్టెంట్ మూర్తి పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'జగనన్నే మా భవిష్యత్తు'



జగన్నాథపురం గ్రామంలో జగనన్న మా భవిష్యత్ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ శేషులత, సర్పంచ్



32వవార్డు ఇన్‌ఛార్జి మారిశెట్టి రమణ ఆధ్వర్యంలో ఇంటింటికీ ప్రచారం నిర్వహిస్తున్న వైసీపీ నాయకులు



పరిమెళ్ల గ్రామంలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న సర్పంచ్ గొర్రెల వెంకట కోటేష్

తాడేపల్లిగూడెం రూరల్: జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ఉత్సాహంగా జరుగుతుంది. మంగళవారం మండలంలోని జగన్నాథపురం, చినతాడేపల్లి గ్రామాల్లో జగనన్న మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. జగన్నాథపురం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ శేషులత ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును ప్రజల్ని అడిగి తెలుసుకున్నారు. పథకాలు కొనసాగాలంటే జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రి కావాలని, ఇందుకు ప్రజలు సహకరించాలని కోరారు. గ్రామ సర్పంచ్ ఉండ్రాజవరపు చంద్రిక, గృహ సారథులు పాల్గొన్నారు. చినతాడేపల్లి గ్రామంలో జరిగిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పిచ్చికల రాజారావు, ఉప సర్పంచ్ చిట్టూరి కాశీ విశ్వనాథం, దూలపల్లి సుమలత, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం అర్బన్ : పట్టణంలో 'జగనే మా భవిష్యత్తు జగనన్నే మా నమ్మకం' కార్యక్రమం కొనసాగుతోంది. 32వ వార్డుల ఇన్‌చార్జి మారిశెట్టి రమణ ఆధ్వర్యంలో గృహసారథులు, వలంటీర్లు, కన్వీనర్లు ఇంటింటికి వెళ్లి జగన్ అందించిన సంక్షేమ పథకాలను వివరిస్తున్నారు. సంక్షేమ లబ్ధిని అందుకున్న ప్రతి కుటుంబాన్ని కలిసి వివరాలు సేకరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ కన్వీనర్లు బద్దెల అనసూయదేవి, దివ్య, ప్రశాంతి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పెంటపాడు: రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే రామరాజ్యం సాధ్యపడుతుందని పరిమెళ్ల గ్రామ సర్పంచ్ గొర్రెల వెంకటకోటేష్ పేర్కొన్నారు. గత రెండు రోజుల నుంచి పరిమెళ్ల గ్రామంలో ఇంటింటికి నువ్వే మా నమ్మకం, జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాల్లో గత నాలుగురోజుల నుంచి విస్తృత స్థాయిలో ప్రచారం చేస్తున్నారు. ఇంటింటికి ప్రచారంలో భాగంగా ప్రజలకు అందిన పథకాలు వివరించారు. ప్రతి ఇంటికి స్టిక్కర్ అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ ఇందుకూరి నాగరాజు, పార్టీ నాయకులు బత్తిన సంజీవరావు, మండల వైఎస్ ఎంపీపీ మండా శివరామకృష్ణ, కడియం రాంబాబు, డొంకా రామకృష్ణ, గేదల వెంకన్న, మండా జయరాజు, తదితరులతో పాటు గృహసారథులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక పాలనపై ఆందోళన



తాడేపల్లిగూడెం మండలం దండగర్ర గ్రామంలో ప్రచార భేరి యాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: ప్రతి రైతు నుంచి ఎకరానికి 110 సొరలు ధాన్యం కొనుగోలు చేయాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని దండగర్ర గ్రామంలో ప్రచార భేరీ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి పాలుపూరి సత్యనారాయణ, సీపీఐ మండల కార్యదర్శి ఉల్లింకల జయకృష్ణ, సీపీఎం నాయకులు కండెల్లి సోమరాజులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ దుర్మార్గాలను నిలదీయాల్సిన అవసరం వచ్చిందని, లేకుంటే భవిష్యత్ మాయమవుతుందన్నారు. దీన్ని వ్యతిరేకిస్తూ ప్రతి పౌరుడు కదిలి దేశాన్ని కాపాడుకోవాల్సిన అవసరం వచ్చిందన్నారు. సీపీఎం నాయకులు గోపాల వెంకట్రావు, కండెల్లి రమేష్‌బాబు, పి.జయమ్మ, సీపీఐ నాయకులు కర్రి సోమేశ్వరరావు, బందుల తాతయ్య, మద్ది సోంబాబు తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న భాజపాను గద్దె దించాలని వామపక్షా నాయకులు డిమాండ్ చేశారు. ఐదోవ రోజు మంగళవారం ప్రచార భేరీ కార్యక్రమంలో భాగంగా కుంచనపల్లి, కేఎస్ఎన్ కాలనీ వార్డుల్లో ఇంటింటికి యాత్ర నిర్వహించారు. సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు చింతకాయల బాబూరావు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా, రైతు, కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయ వ్యతిరేక విధానాలను అవలంబిస్తు, అన్ని వర్గాలను మోసం చేస్తుందన్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారం పంపిణీ



విద్యార్థులకు పౌష్టికాహారం కిట్లు పంపిణీ చేస్తున్న లియో క్లబ్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): వశిష్ట లియో క్లబ్ తరుపున లయన్స్‌క్లబ్ సభ్యులు కోనా హనుమాన్, పేరిచర్ల మురళీకృష్ణంరాజుల సౌజన్యంతో మంగళవారం అనాథ ఆశ్రమం విద్యార్థులకు పౌష్టికాహారం అందజేశారు. లియో క్లబ్ మాధురి మాట్లాడుతూ క్లబ్ తరుపున విద్యార్థులకు మనోధైర్యం కల్పించేందుకు అనేక సేవలు వారికి అందిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సంపత్, సాయి శృతి, ప్రజ్ఞ, అంబిక, రెడ్డి నందిని, దివ్య తదితరులు పాల్గొన్నారు.

నాటు సారా ముద్దాయిపై పీడీ యాక్ట్

మొగల్తూరు: నాటు సారా కేసులో ముద్దాయిపై కలెక్టర్ ఆదేశాల మేరకు పీడీ యాక్ట్ నమోదు చేసినట్లు సెబ్ సీఐ డి సురేఖ మంగళవారం తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం మొగల్తూరు పంచాయతీ కుక్కలవారితోటకు చెందిన గుబ్బల నర్సింహమూర్తిపై సారా కేసులు ఉన్నాయి. కలెక్టర్ ప్రశాంతి ఆదేశాల మేరకు నర్సింహమూర్తిపై పీడీ యాక్ట్ నమోదు చేసి రాజమహేంద్రవరంలోని సెంట్రల్ జైలుకు తరలించినట్టు తెలిపారు.